సంపుటి: 4 | సంచిక: 2

జనవరి - ఫిబ్రవరి, 2016

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన
నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును.



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

క్రీస్తునందు ప్రియులైన వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీరందరు క్షేమమని భావిస్తున్నాను. దేవుని మహా దయ వలన మనము 2016 సంవత్సరములో ప్రవేశించి మనుగడను కొనసాగించుచున్నాము. సంవత్సరములు జరుగుచుండగా మనుష్యుల ఆలోచనా విధానములో ఎన్నో మార్పులు కలుగుచున్నవి, నానాటికి స్వార్థము పెరిగిపోతూ మనుష్యులు ఎంతో అసహనముతో ప్రవర్తించడం మనకు కనిపిస్తుంది. దేవుడు నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించమని చెబితే ధన సంపదలను, వస్తువులను ప్రేమించు అన్నట్లు ప్రవర్తిస్తూ, ప్రేమించవలసిన వాటిని ద్వేషిస్తూ కేవలం ఉపయోగించవలసిన వాటిని ప్రేమిస్తూ ఎంత దిగజారిపోవుచున్నామో కనబడుచున్నది.

స్పర్శ పాఠకులకు దేవుని మాటగా తెలియపరచుచున్న విషయము ఏమనగా జీవితములో మనము ఎంత ప్రశాంతముగా ఈ భూమి మీద జీవిస్తే అంత ధన్యులము. దాని కొరకు దేవుని ప్రేమ హృదయములో కలిగి మన జీవితములో దేవుడు అనుగ్రహించిన మానవ సంబంధములన్నింటిలో జ్ఞానము కలిగి ప్రవర్తించ వలసి ఉన్నది. భూసంబంధమైన వాటిలో వేటిని పోగొట్టుకొనిన మరల సంపాదించుకొనవచ్చును. మానవ సంబంధములను చెరుపుకొనిన యెడల మరలా సంపాదించుకోలేము, మరియు ఎదుటి వారికి కూడా నెమ్మది లేకుండ చేస్తాము. చివరకు దేవునికి దూరమై మన నిరీక్షణ అయిన నిత్యజీవమును కూడా పోగొట్టుకొనుట జరుగుతుంది. ఎవడైనను – నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు – 1 యోహాను 4:20 కనుక మన బ్రతుకు దినములన్నియు మనుష్యులతో మన సంబంధముల విషయములో మెలకువతో ప్రవర్తించవలయును.

అట్టి ధన్యత దేవుడు దయ చేయును గాక!

మీ సహోదరుడు.....



సంపుటి: 4 | సంచిక: 2
జనవరి – ఫిబ్రవరి, 2016

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దేవదూతలు (Angels) ........ 2
- విశ్వాస వీరుడు – జేమ్స్ హడ్సన్ టేలర్ ........ 5
- నోటి మాటలు (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర – 44వ భాగము ........ 10
- సంతృప్తి (బాలల శీర్షిక) ........ 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 14
- దాతృత్వము ........ 16
- ప్రార్థనా శక్తి ........ 19
- ప్రార్థనా కూడికలు ........ 21
- బైబిల్ క్విజ్–44 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా :
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 70, ఫోన్: 040–2420 2227



# దేవదూతలు
## (Angels)

**- బ్రదర్. ఎపఫ్రా**

మానవుని జీవిత ప్రయాణంలో దృశ్యమైనవి, అదృశ్యమైనవి లేక చూడగలిగినవి చూడలేనివి అని కూడా సంభోధిస్తూ ఉంటాము. వాటిలో చూడలేనివి దైవము, భూతము అని మన పెద్దలు అంటూవుంటారు. దైవము లేక దేవుడు అనే భక్తిభావము పైకి కనిపించేది కాకపోయినప్పటికీ మనుష్యులు అనుభూతి లేక స్పర్శను పొందుతూ ఉంటారు. అలాగే దెయ్యము లేక భూతము అనే వాటి విషయంలో కూడా అనేకులు ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటూవుంటారు. దెయ్యము లేక భూతము అనేవి వాస్తవము అయినప్పటికీ, అనేక మానసిక సమస్యలను కూడా దెయ్యముల జాబితాలో వెయ్యడం జరుగుతుంది. అందుకే సమాజంలో వాస్తవమైన సంగతులను కూడా మానసిక సమస్యలుగా కొట్టిపారవేయడం జరుగుతుంది. ఇక మన ధ్యానభాగమైన సంగతిలోనికి వచ్చినట్లయితే బైబిల్ గ్రంథంలో కీర్తనలు 91:11లో **"నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును"** అని వ్రాయబడి ఉంది. అనగా దేవుడు తన ప్రజలను కాపాడుటకు దూతలను వాడుకొనుట జరుగుచున్నది. ఈ విషయం అదృశ్యమైనవాటిని నమ్మని నాస్తికులు నమ్మక పోవచ్చునుగాని, దేవుని నమ్మినవారికి అనుభవమే. ఈ సంవత్సరము దేవుడు సహవాసము కొరకు ఇచ్చిన వాగ్ధానము

**"నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును"** - కీర్తనలు 91:11

కనుక దీనిని హృదయపూర్వకముగా విశ్వసించినవారి జీవితములో దేవుడు నిశ్చయముగా ఆయన దూతలను పంపి అన్ని విధములుగా కాపాడి, రక్షించగలడు అనేది వాస్తవం. దేవునిని విశ్వసించినవారి చరిత్రలో ఎన్నో సందర్భములలో ఆయన దూతల వలన కలిగిన మేలులు ఎంతో ఉన్నతమైనవి. మానవ బలమునకు, శక్తికి అతీతమైన కార్యములు దేవుని దూతలైనవారు చేయగలరు. దేవుని ఆజ్ఞను శిరసావహించి, ఆయన చెప్పిన పనులను భూమి మీద చేయుటకు ఉన్న ఆత్మజీవులే దేవునిదూతలు. పాత నిబంధనలో 108 సార్లు, క్రొత్త నిబంధనలో 165 సార్లు, మొత్తం 273 సార్లు బైబిల్ గ్రంథములో ప్రస్తావించబడినది. దేవుని దూతలు దేవుని చేత సృష్టించబడినవారు. **ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను.** – కొలస్సీ 1:16

దేవునిదూతలు నిరంతరము జీవించుటకు సృష్టించబడ్డారు. **“వారు పునరుత్థానములో పాలివారైయుండి, దేవదూత సమానులును దేవుని కుమారులునై యుందురు గనుక వారికను చావనేరరు”** – లూకా 20:36.

దేవునిదూతలయొక్క పాత్రను బైబిల్ గ్రంథము క్రింది విధముగా విభజించుచున్నది.

1. దేవుని వర్తమానికులు
2. దేవుని సర్వ శక్తిగల సైనికులు
3. చరిత్రను తెలియజేయువారు (భూత, భవిష్యత్తు మరియు వర్తమానములు)
4. దేవునిని స్తుతించి మరియు ఆరాధించువారు
5. దేవుని పక్షమున సంరక్షించువారు

దేవుని దూత అనే మాటకు అర్థము వర్తమానికుడు. బైబిల్‌లో క్రీస్తు భూమి మీదకు రాబోవుతున్న సంగతి దూతలద్వారా తెలియపరచబడిన విషయములలో ప్రాముఖ్యమైనది. మరి ముఖ్యముగా మరియకు తన గర్భములో క్రీస్తు పుట్టబోవుతున్నాడు అనే సంగతి తెలియపరచుటకు ప్రధాన దూతయైన గబ్రియేలును దేవుడు పంపడం జరిగింది. తరువాత గొఱ్ఱెల కాపరులకు తెలియపరచిన దూత ఆయన లోక రక్షకుడు అనే గొప్ప సత్యాన్ని లోకానికి తెలియపరచాడు. అంతమాత్రమే కాక పౌలు ఓడ పగిలి ఆపదలో ఉన్నప్పుడు దేవుని దూత ధైర్యపరచడం జరిగింది.



ఇప్పుడు దేవుని దూతలద్వారా దేవుడు తన సేవకుని కాపాడిన సంగతిని బైబిల్‌లో నుండి ధ్యానించుదాము. **“పేతురు చెరసాలలో ఉంచబడెను, సంఘమయితే అతనికొరకు అత్యాసక్తితో దేవునికి ప్రార్థన చేయుచుండెను. హేరోదు అతనిని వెలుపలికి తీసుకొని రావలెనని యుండగా, ఆ రాత్రియే పేతురు రెండు సంకెళ్లతో బంధింపబడి ఇద్దరు సైనికుల మధ్య నిద్రించుచుండెను; మరియు కావలివారు తలుపు ఎదుట చెరసాల కాచుకొనుచుండిరి. ఇదిగో ప్రభువు దూత అతని దగ్గర నిలిచెను; అతడుండిన గదిలో వెలుగు ప్రకాశించెను. దూత పేతురు ప్రక్కను తట్టి - త్వరగా లెమ్మని చెప్పి అతని లేపగా సంకెళ్లు అతని చేతులనుండి ఊడిపడెను. అప్పుడు దూత అతనితో - నీవు నడుము కట్టుకొని చెప్పులు తొడుగుకొనుమనెను. అతడాలాగు చేసిన**

**తరువాత దూత - నీ వస్త్రము పైన వేసికొని నా వెంబడి రమ్మని అతనితో చెప్పెను। అతడు వెలుపలికి వచ్చి దూత వెంబడి వెళ్ళి, దూతవలన జరిగినది నిజముగా జరిగెనని గ్రహింపక, తనకు దర్శనము కలిగెనని తలంచెను. మొదటి కావలిని రెండవ కావలిని దాటి పట్టణమునకు పోవు ఇనుప గవినియొద్దకు వచ్చినప్పుడు దానంతట అదే వారికి తెరచుకొనెను. వారు బయలుదేరి యొక వీధి దాటిన వెంటనే దూత అతనిని విడిచిపోయెను. పేతురుకు తెలివివచ్చి - ప్రభువు తన దూతను పంపి హేరోదు చేతిలోనుండియు, యూదులను ప్రజలు నాకు చేయనుద్దేశించిన వాటన్నిటినుండియు నన్ను తప్పించియున్నాడని యిప్పుడు నాకు నిజముగా తెలియునని అనుకొనెను.** - అపొ 12:5-11.

పేతురు అనే యేసు శిష్యుడు దేవుని వాక్యమును బలముగా బోధించుచున్న దినములలో, రాజైన హేరోదు పరిపాలన చేయుచుండగా యూదులు క్రీస్తు యొక్క సువార్తకు వ్యతిరేకముగా ఉన్న సందర్భములో రాజు యాకోబు అనే శిష్యుని ఖడ్గముతో చంపించిన సంగతి యూదులకు సంతోషముగా ఉందని గ్రహించి పేతురుని కూడా పట్టుకొని చెరసాలలో వేయించాడు. పేతురుని కాపలా కాయుటకు 16 మంది సైనికులకు అప్పగించాడు. పేతురు కొరకు సంఘస్తులు అత్యాసక్తితో ప్రార్థన చేయుచున్నారు. ఆ రాత్రి ప్రభువు దూత పేతురు ఉన్న చెరసాలలోనికి వెళ్ళి, అతని సంకెళ్ళనుండి విడిపించి చెరసాల వెలుపలికి అతనిని తీసుకురావడం జరిగింది. పేతురు చెరసాల బయటకు వచ్చేవరకు అది కల అని తలంచెను. చెరసాల బయటకు వచ్చిన తరువాత దేవుని దూత పేతురుని విడచి వెళ్ళిపోగా పేతురు అప్పుడు అది కల కాదు నిజము అని గ్రహించి దూత వలన అది జరిగెనని అర్థం చేసుకున్నాడు. ఎంత అద్భుతం! తన ప్రజలు బంధకములలో ఉన్నప్పుడు దేవుడు తన దూతద్వారా మనుష్యులకు అసాధ్యమైన కార్యములను చేయడం జరిగింది. ఇలా గమనిస్తే అనేకమైన కార్యములు బైబిల్ గ్రంథములో మనం చూడగలం.

ఈ నూతన సంవత్సరములో మన జీవితములలో కూడా మనుష్యులకు సాధ్యం కాని వాటిని ఆయన తన దూతల ద్వారా జరిగించగలడని విశ్వాసముంచుదాము. తద్వారా జీవితంలో ఉన్న ఎటువంటి శ్రమలైనా, బంధకములైనా, ఆటంకములైనా ఆయన విడిపించి నిన్ను క్షేమంగా ఉంచునుగాక! ఆమేన్.



# విశ్వాస వీరుడు
# జేమ్స్ హడ్సన్ టేలర్

చైనా రూపురేఖల్ని మార్చిన గొప్ప క్రైస్తవుడు హడ్సన్ టేలర్! చైనాలో క్రీస్తును ప్రభువుగా ప్రకటించి, ప్రజల హృదయాల్లో ఆయనను ప్రభువుగా ప్రతిష్ఠించి దేవుని మహిమపరచిన మహామిషనరీ. జేమ్స్ హడ్సన్ టేలర్ 1832లో ఇంగ్లాండ్‌లోని ఓ భక్తిగల దంపతులకు జన్మించాడు. టేలర్ తల్లిదండ్రులు "ప్రియమైన దేవా, మీరు మాకు కుమారుడిని అనుగ్రహిస్తే, అతడు చైనాలో మీ సేవ చేయునట్లు కృప చూపండి" అని ప్రార్థింపగా దేవుడు 1854లో దానికి అద్భుతరీతిలో జవాబు ఇచ్చారు!

వైద్యశాస్త్రాన్ని, వేదాంత విద్యను అభ్యసిస్తూ దేవునిపై ఆధారపడే విషయం అనేక విలువగల పాఠాలు నేర్చుకున్న తరువాత, హడ్సన్ టేలర్ క్రీస్తు రాయబారిగా చైనాలో అడుగుపెట్టాడు. షాంగాయ్ మరియు నింగ్‌పో అనే స్థలాల్లో ఆరు సంవత్సరాలు ప్రయాసపడ్డాడు. అటు తరువాత ఇంగ్లాండ్‌కు తిరిగివచ్చి నింగ్‌పో భాషలోనికి నూతన నిబంధన తర్జుమా చేస్తూ, చైనా దేశానికి మిషనరీలను పంపమని దేవునికి ప్రార్థించాడు. 1865లో ఆయన "చైనా ఇన్‌లాండ్ మిషన్" స్థాపించి చైనా తిరిగి వచ్చాడు. అక్కడ ప్రభువు కొరకు నలభై సంవత్సరములు నిర్విరామంగా కృషి చేసాడు. 1905లో ఆయన కన్ను మూయకముందు 205 మిషన్ స్టేషన్లు, 849 మిషనరీలు మరియు 1,25,000 చైనీస్ క్రైస్తవులు చైనా ఇన్‌లాండ్ మిషన్‌లో ఉన్నారు.

టేలర్‌ని గూర్చి వర్ణిస్తూ "హడ్సన్ టేలర్ దేవుని కృప ద్వారా దర్శనం, భారం, భక్తి, ప్రేమ, జ్ఞానము, ధైర్యము కలిగి ముందంజవేసి వీరోచితమైన కార్యాలు చేసిన బలాఢ్యుడు. మెత్తని హృదయం గల ధీశాలి. టేలర్ ఆత్మీయ ఆజానుబాహుడు గనుక ప్రస్తుత క్రైస్తవులమైన మనం ఆయన మాదిరిని పోలి నడుచుకుంటే మనకెంతో మేలు", అని ఓ భక్తుడు అన్నాడు. హడ్సన్ టేలర్ మనుష్యులను ప్రార్థన మూలముగా దేవుని ద్వారానే కదిలించాలనే తత్వం కలిగి దాని వలన అనేక కార్యాలు సాధించాడు. తన విస్తారమైన సేవ విషయం ఎప్పుడు మనుష్యులను డబ్బు కొరకు అడుగలేదు. ఇంగ్లాండ్ నుండి ఆయనకు ఆర్థిక సహాయం వచ్చేది కాదు. "దేవుని పరిచర్య దేవుని పద్ధతిలో చేసినపుడు దేవుని సహాయం తప్పక అందుతుంది" అన్న సత్యాన్ని తన జీవితంలో నెరవేర్చాడు! ప్రార్థన ద్వారానే తన ప్రవర్తన కాపాడుకుంటూ, పరిచర్య చేస్తూ, ప్రభువు చేతుల్లో ఫలభరితమైన సాధనమయ్యాడు.

మరియ డైయర్‌ని పెళ్ళి చేసుకుని సేవ చేస్తుండగా శ్రమలు, కఠినపరిస్థితులు విస్తరించాయి. టేలర్ కుమార్తె మెదడు వ్యాధితో చనిపోయింది. యాంగ్‌చే గలాటాల్లో ఓసారి వారి ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడింది. టేలర్ మొదటి భార్య కాన్పు సమయంలో చనిపోయింది. ఆయన రెండవ భార్య క్యాన్సర్‌తో మరణించింది. హడ్సన్ టేలర్ తరచు అనారోగ్యానికి గురయ్యేవాడు.

శ్రమలు విస్తరించినప్పుడు అందులో "నా కృప నీకు చాలును, బలహీనతయందు నా శక్తి పరిపూర్ణమగుచున్నదని" ప్రభువు సెలవిచ్చినట్లే టేలర్ జీవితంలో జరిగింది. 1900లో బాక్సర్ తిరుగుబాటులో దాదాపు 56 మంది మిషనరీలు హతసాక్షులైయ్యారు, వందలాది చైనీస్ క్రైస్తవులు హతులయ్యారు. అయినప్పటికి టేలర్ మిషనరీ సేవ కొనసాగింది. క్రీస్తు కొరకు ఫలం సాధించింది. దేవునిని గొప్పగా మహిమపరచింది. ఈ నాటికి కమ్యూనిస్ట్ చైనాలో క్రైస్తవ్యం వెలుగుతోందంటే దాని వెనుక వారిని ప్రేమించి, వారిలో ఒకనిగా మారి, వారి కొరకు ప్రయాసపడిన జేమ్స్ హడ్సన్ టేలర్ కారణం.


## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

---

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

# నోటి మాటలు

- సిస్టర్ వి.విజయ

**సమయోచితముగా పలుకబడిన మాట**

**చిత్రమైన వెండి పళ్ళెములలో నుంచబడిన బంగారు పండ్లవంటిది - సామె 25:11**

కష్టములో సమస్యలో ఉన్నవారిని చూచి మాట్లాడని వారమైతే మేలు చేయనివారము. మాట్లాడకపోవటం భక్తి అనుకుంటే నష్టం కాని ఒక సమయోచితమైన మాట, సలహా ఎదుటి వారి జీవితములో అద్భుతమును, మార్పుని కలుగజేస్తుంది. ఎదుటి వారి కష్ట సమయములోనైనా, సంతోష సమయములోనైనా సమయోచితముగా మాట్లాడాలి కాని అసందర్భ ప్రేలాపనలు చేయకూడదు. ఈ విధముగా మాట్లాడటం రానివారు తమకే కాక, అనేకులకు నష్టమును కలిగించే వారిగా ఉంటారు. కనుక సమయోచితముగా పలుకబడిన మాట వెండి పళ్ళెములో బంగారు పండ్ల వంటివి అని గ్రహించి ఈ విధమైన మాటలు మాట్లాడడానికి మన జీవితములో సాధకము చేసుకోవాలి.

**సిరియారాజు సైన్యాధిపతియైన నయమాను అను నొకడుండెను. అతని చేత యెహోవాయే సిరియా దేశమునకు జయము కలుగజేసి యుండెను గనుక అతడు తన యజమానుని దృష్టికి ఘనుడై దయ పొందిన వాడాయెను. అతడు మహా పరాక్రమ శాలియై యుండెను గాని అతడు కుష్ఠరోగి. - 2 రాజులు 5:1**



ఈ నయమాను స్వస్థత కొరకు ఎలీషా ప్రవక్త యొద్దకు వచ్చినప్పుడు ఎలీషా యొర్దాను నదికి వెళ్ళి 7 మార్లు స్నానము చేసిన యెడల శుద్ధుడవగుదువని చెప్పిన మాటకి నయమాను కోపంతో తిరిగి వెళ్లిపోయెను. **అయితే అతని దాసులలో ఒకడు వచ్చి - నాయనా, ఆ ప్రవక్త యేదైనా నొక గొప్ప కార్యము చేయుమని నియమించిన యెడల నీవు చేయకుందువా? అయితే స్నానము చేసి శుద్ధుడవు కమ్మను మాట దాని కంటె మేలు కాదా అని చెప్పినప్పుడు! అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడు మారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహము వలెనై అతడు శుద్ధుడాయెను - 2 రాజులు 5:13,14**

నయమాను యొక్క దాసుడు ఇచ్చిన సమయోచితమైన సలహా అతనికి మంచి ఆరోగ్యము ఇచ్చింది. ఒక సలహాని మనం ఇచ్చినట్లైతే మనకి అనేక సలహాలు ఇచ్చేవారిని సంపాదించుకుంటాము. ఎవరైనా ఒక మంచి సలహా చెప్పినప్పుడు చేయడానికి ఆలోచించక వెంటనే అమలు చేసే విధంగా సిద్ధపడితే గొప్ప మేలుని పొందుకుంటాము.

**నేను - అయ్యో, నేను అపవిత్రమైన పెదవులు గలవాడను; అపవిత్రమైన పెదవులుగల జనుల మధ్యను నివసించువాడను; నేను నశించితిని; రాజును సైన్యముల కధిపతియునగు యెహోవాను నేను కన్నులారా చూచితిననుకొంటిని. అప్పుడు ఆ సెరాపులలో నొకడు తాను బలిపీఠముమీద నుండి కారుతో తీసిన నిప్పును చేత పట్టుకొని నా యొద్దకు ఎగిరి వచ్చి నా నోటికి దాని తగిలించి ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ పాపమునకు ప్రాయశ్చిత్తమాయెను, నీ దోషము తొలగిపోయెను అనెను. - యెషయా 6:5,6,7** మొదట యెషయా ప్రవక్త నేను అపవిత్రమైన పెదవులు గలవాడను అని గ్రహించి, దేవుని వేడుకొనినపుడు అగ్నితో పెదవులను తాకి అపవిత్రత నుండి విడిపించెను. ఆ తరువాత దేవుని పనిలో శిష్యులకి తగిన నోరు నాకు దయచేసి యున్నాడు అని చెప్పుచున్నాడు.

**"అలసిన వానిని మాటల చేత ఊరడించు జ్ఞానము నాకు కలుగునట్లు శిష్యునికి తగిన నోరు యెహోవా నాకు దయచేసి యున్నాడు" - యెషయా 50:4**

శిష్యులు అనగా ఆయనను వెంబడించి, ఆయన మార్గములలో నడుచువారు. శిష్యునికి తగిన నోరు మనకి ఉండాలి. అందరము నోరు కలిగి ఉంటాము కానీ కొంతమంది మాత్రమే శిష్యులకు తగిన నోరు కలిగి ఉంటారు. అబద్దమాడుచూ, దూషించుచూ పరిహాసమాడుచూ, అవమానపరచుచూ కొంతమంది మాట్లాడుతూ ఉంటారు. ఇది ఆయన శిష్యులకు తగిన నోరు కాదు **ఇదిగో నేను నీ నోట నా మాటలు ఉంచియున్నాను - యిర్మీయా 1:9** మన నోట ఆయన మాటలు ఉంచారు. ఆదరణ లేని వారికి ఆదరణ, అలసిన వారికి ఓర్పుని, నిరీక్షణ లేని వారికి నిరీక్షణ కలుగజేయునట్లుగా మన మాటలు ఉండాలి.

మనము శిష్యులకు తగినట్లుగా నోరు కలవారమైతే ఇబ్బందులలో, బాధలలో పరామర్శించే వారిగా ఉంటాము. అవమానమును నిర్లక్ష్యపెడతాము, సహించుకునే వారిగా ఉంటాము.

దేవుడు మన నోటికి ఎంత అధికారమును అనుగ్రహించారంటే పౌలు, బర్నబా యొక్క నోటి నుండి వచ్చిన మాటని స్థిరపరచి, క్రీస్తులో అధిపతి కలిగి ఉన్న విశ్వాసము నుండి తొలగించవలెనని ప్రయత్నము చేయుచున్న వ్యక్తిని గ్రుడ్డివాడిగా మార్చారు. **అతని తేరిచూచి - సమస్త కపటముతోను సమస్త దుర్మార్గముతోను నిండినవాడా, అపవాది కుమారుడా, సమస్త నీతికి విరోధీ, నీవు ప్రభువు యొక్క తిన్నని మార్గములు చెడగొట్టుట మానవా ? ఇదిగో ప్రభువు తన చెయ్యి నీమీద ఎత్తియున్నాడు; నీవు కొంతకాలము గ్రుడ్డివాడవై సూర్యుని చూడకుందువని చెప్పెను. వెంటనే మబ్బును చీకటియు అతని కమ్మెను గనుక అతడు తిరుగుచు ఎవరైన చెయ్యిపట్టుకొని నడిపింతురా అని వెదకుచుండెను. అంతట ఆ అధిపతి జరిగినదానిని చూచి ప్రభువు బోధకు ఆశ్చర్యపడి విశ్వసించెను - అపో.కా 13:10,11,12** మన

నోటి ద్వారా ఎవరినీ చెడగొట్టకూడదు, ఎవరూ విశ్వాసములో నుండి తొలగిపోయే విధంగా మాట్లాడకూడదు. విసుగు చెందిన వారి జీవితమునకు ఊరడించే మాట, కృంగిన వారిని ధైర్యపరిచే మాట అవసరం. శిష్యులకు తగిన నోటిని కలిగి ఉండుట వలన పెల్లగించుటకు, విరగగొట్టుటకు, కట్టబడుటకు అధికారం కలిగిన మాటలని దేవుడు మనకి అనుగ్రహిస్తారు.

మొదట మనము అపవిత్రమైన పెదవులు గలవారమని గ్రహించి, మన నోటిని ముట్టునట్లుగా దేవుని వేడుకుంటే, ఆయన ముట్టి మన నోటిని ఉపయోగించుకుంటారు.

ముసలమ్మ ముచ్చట్లను విసర్జించి, దైవభక్తి విషయములో మనలను మనము సాధకం చేసుకోవాలి. అనవసరమైన విషయములను మాట్లాడే వారముగా కాక, అన్ని విషయములలో మితముగా ఉంటూ, మన జీవితములతో మాటలతో అనేకులకు ప్రయోజనకరముగా మార్పు చెందుదాము.

కనుక ప్రియమైన వారలారా! గడిచిన నెలల నుండి మనం ధ్యానిస్తున్న మాటల విషయములో మాట్లాడకూడని వాటిని విడిచిపెట్టి ఈ నూతన సంవత్సరములో అమూల్యమైన మాటల ద్వారా మన వ్యక్తిగత, కుటుంబ జీవితములకు అదే విధంగా మన తోటివారికి ప్రయోజనకరంగా ఉందామా !

ఈ నూతన సంవత్సరములో దేవుడు అట్టి కృపను మనకు అనుగ్రహించును గాక !

మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు !

## ఉపవాస ప్రార్థన

ఉపవాస ప్రార్థన - 2016, **జనవరి 26వ** తేది (మంగళవారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
కావున పాల్గొని దేవుని దీవెనలు పొందగలరు.

**వివరములకు:**

**9666666249**
**040-24202227**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 44వ భాగము**

ఈ దినములలో క్రైస్తవ సంఘానికి విశాల దృక్పథం అవసరం. క్రైస్తవులు తెగ మత విభేదాలు మాని ప్రభువు ఆత్మ ఏ రూపంలో తన పనిని జరిగించుకొనుచున్నప్పటికిని గుర్తించడానికి సిద్ధంగా ఉండాలి. మనకి అలవాటు లేని పద్ధతిని వారవలంబిస్తున్నప్పటికిని ప్రభువు యొక్క ఆశీర్వాదం ఈ రహస్య క్రైస్తవ మిషన్‌పై ఉన్నది, వారి నాయకులు సాంప్రదాయ సిద్ధమైన సంఘముల యెల్లలను దాటి ఎన్నో గొప్ప కార్యములు ఈ దేశములో చేస్తున్నారని చెప్పాడు సుందర్.

తరువాత సాధువు వెళ్ళిపోయాడు, ప్రజలు కూడ మౌనంగా వెళ్ళిపోయారు. కాషాయాంబరుడై పాదరక్షలు కూడా ధరించని ఈ భారత యౌవనుడు ప్రవక్త వంటి అగ్నితోను, అపోస్తలుల శక్తితోను ప్రసంగించాడు గాని ఎలాంటి ఆర్భాటం లేకుండ సామాన్య ప్రజల మధ్య మౌనంగా సంచరిస్తూ ఉన్నప్పుడు యేసుక్రీస్తు యొక్క సాత్వికము, జాలి కలిగిన ఆయన మనస్సు ప్రజలకు గుర్తొచ్చాయి.

సుందర్‌ని కలసి ఆయనతో 20 నిమిషములు మాట్లాడిన యౌవనుడగు ఆర్.ఆర్.రాజమణి అప్పటికింకా పాఠశాల విద్యార్థి. ఇతడు సుందర్‌తో మాట్లాడడానికి వారి హెడ్మాష్టర్ యేర్పాటు చేశారు. దీనికి గాను వారు 12 మైళ్ళు ఎద్దుల బండిలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. ముందుగా హెడ్మాష్టర్ గారు సుందర్‌సింగ్‌ని కలిశారు. తరువాత రాజమణి గారి వంతు. సుందర్ సింగ్‌ను గూర్చి ఎన్నెన్నో వింతైన కథలు విన్నాడు రాజమణి. ఇప్పుడింత ప్రఖ్యాతి గాంచిన సాధువును కలిసే అవకాశం అకస్మాత్తుగా దొరికేసరికి రాజమణి ఉబ్బితబ్బిబ్బయ్యాడు. లోపలికి వెళ్లగానే రాజమణిని చూచి చిరునవ్వుతో ఏమైనా అడగాలనుకుంటున్నావా అని అడిగాడు సుందర్. రాజమణికి ఒక్కటీ గుర్తుకు రాలేదు సుందర్ సింగ్ ఆహారపుటలవాట్లును గూర్చి పాఠశాలలో ఇతర విద్యార్థుల ద్వారా విన్నవి మాత్రమే గుర్తు వచ్చాయి.

"అయ్యా ! మీరు ఒట్టి కారమే తింటారంట నిజమేనా ?" అని అనుకోకుండానే అడిగాడు రాజమణి. ఈ ప్రశ్న విని మొదట్లో కొంచెం అదిరిపడినప్పటికిని ఆ వెంటనే పగలబడి నవ్వాడు. ఆ తరువాత "లేదు బాబు ! మీలాగానే నేనూ భోజనం చేస్తాను" అని

ప్రసన్నంగానే చెప్పి ఇంకా ఏ ప్రశ్నలున్నాయన్నాడు సాధువు. "స్నానం లేకుండానే మీరు శుభ్రంగా ఉంటారట గదా అందువలన మీరెప్పుడూ స్నానం చేయడం గాని బట్టలు ఉదుకుకోవడం గాని చేయరట నిజమేనా ?" అని అడిగాడు రాజమణి. సుందర్ మళ్ళా నవ్వాడు. తనను గూర్చి ప్రచారములో ఉన్న ఈ కట్టుకథలన్నింటిని రాజమణి ద్వారా వింటుంటే ఆయనకు నిజంగానే సంతోషంగా ఉండింది. "అదేం కాదు నాకు చాలా చెమట పడుతుంది. కాబట్టి తరచుగా స్నానం చేయాల్సి వస్తుంది, నా బట్టలు కూడా ఉదుకుకుంటాను" అని కచ్చితంగా చెప్పాడు సుందర్.

రాజమణికి పెద్ద బరువు దించేసినట్లనిపించింది. సాధువు కూడా మామూలు మానవుడే కదా అని నిర్ధారించుకున్నాడు. దీని తరువాత వారు ఎంతో ప్రాముఖ్యమైన విషయాలు సంభాషించారు. కైలాస మహర్షిని గూర్చి తెలుసుకోవాలని కోరాడు రాజమణి. ప్రఖ్యాతి గాంచిన ఈ ఋషిని గూర్చి, ఆయన దగ్గరకు వెళ్ళాలంటే చేయవలసిన ప్రయాణమును గూర్చి విన్న తరువాత "అయ్యా ! నేను మీతో కూడా వస్తానండీ" అన్నాడు రాజమణి. అంత దీర్ఘప్రయాణం చేయగల బలం నీకు ఇంకా రాలేదు ఈ రకమైన జీవితం అంటే పూల పాన్పు కాదు, దేవుడు నిర్ణయిస్తే తప్ప ఇలాంటి జీవితములో ప్రవేశింపకూడదు అని చెప్పి ఒకానొక దినమున దేవుడు నిన్ను పిలుస్తాడు. అప్పుడు నాలాగే నీవు ఆయన సేవలో ముందుకు సాగుతావు అని చెప్పాడు సుందర్. తరువాత వారిద్దరు మోకరించినపుడు రాజమణి కోసం ప్రార్థించాడు సుందర్. ఆ తరువాత ఎన్నో సంవత్సరములకు భక్తసింగ్ గారితో కలిసి ఆ స్థలంలో సువార్త ప్రకటించడానికి వచ్చినప్పుడు సుందర్ చెప్పిన మాటలు అక్షరాలా నిజమైనాయని జ్ఞాపకం చేసుకున్నాడు రాజమణి.

– సేకరించబడింది

(ఇంకా ఉంది )


**ఎపఫ్రా మినిస్ట్రీస్ – వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హాయత్ నగర్) NH-9,**

**చాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

**అందరూ ఆహ్వానితులే....!**

**వివరములకు:**

9666666249 | 040-24202227



# "సంతృప్తి"

Happy new year పిల్లలూ! ఎలా ఉన్నారు? 2015 సం॥ అంతా దేవుడు మనల్ని కాపాడి సంరక్షించినందుకు థ్యాంక్స్ చెప్పారా? కృతజ్ఞత కలిగి ఉండటం వలన సంతృప్తిగా అంటే సంతోషంగా జీవిస్తాము. చిన్నప్పటినుండే మీరు కృతజ్ఞతాభావము కలిగి జీవించాలని, దేవుని దయలో మీరు వర్ధిల్లాలి అని కోరుకుంటున్నాను.

ఒక ఊరిలో విశ్వం, రాజేష్ అనే ఇద్దరు బీద పిల్లలు ఉండేవారు. ఇద్దరూ బ్రతకడానికి యాచించేవారు అంటే అడుక్కుని బ్రతికేవారు. అడుక్కునేవారని కొంతమంది జాలిపడి రూపాయో, అర్ధరూపాయో దానం చేసినా అది వారికి ఎంత మాత్రమూ సరిపోయేది కాదు. రాత్రి పూట పస్తులుండాల్సి వచ్చేది. ఆకలితో తినడానికి లేక బాధపడేవారు.

"పరుగెత్తుదాం, గంతులేద్దాం, ఆడుకుందాం, దొంగాట ఆడదాం అంటూ పిల్లలు గోలగోలగా అరుస్తున్నారు. రాజేష్, విశ్వం వాళ్ళని గమనిస్తూ నిలబడ్డారు. వాళ్ళతో కలసి ఆడుకోవాలంటే కుదరదు, ఎందుకంటే విశ్వం కుంటివాడు, రాజేష్ గుడ్డివాడు. మిగతా పిల్లలాగా వీరు ఆటలు ఆడలేరు, చదువుకునే స్థోమతా లేదు. వారికి ఎవరి తోడూ లేదు వాళ్ళ పనులు వాళ్ళే చేసుకోవాలి. వారి తిండి వారే సంపాదించుకోవాలి. అనాథలు అన్నమాట.

బిచ్చగాళ్ళుగా ఎక్కువ సమయం చర్చిదగ్గర ఉండేవారు కాబట్టి యేసుక్రీస్తు గురించి తెలుసు. రాజేష్ కళ్ళు లేవని బాధపడుతున్నప్పుడల్లా విశ్వం ధైర్యం చెబుతూ ఉండేవాడు. "ప్రభువు దయ మన మీద ఉంటుంది, మనం దేవుని బిడ్డలం అనాథలం కాదు అని ఏదో ఒక రోజు మనం కూడా అందరిలా సంతోషంగా బ్రతుకుతాం" అని చెబుతూ ఉండేవాడు.

ఒకరోజు "విశ్వం! ఎంతకాలం మనమిలా కడుపు మాడ్చుకుని బ్రతుకుతాం? రోజూ చూస్తూ ఉండటం వలన ఈ ఊరి వాళ్ళకు మనమంటే జాలి తగ్గిపోయింది. ఈ చుట్టు ప్రక్కల ఊళ్ళన్నీ తిరుగుదాం. నువ్వునా భుజముల మీద కూర్చో, నీకు కాళ్ళు లేవని బాధపడకు నేను నిన్ను మోస్తాను, నువ్వు నాకు దారి చూపించు. ఇద్దరం కలసి యాచిద్దాం" అని రాజేష్ చెప్పాడు. విశ్వం అందుకు అంగీకరించి, రాజేష్ భుజాల మీద కూర్చుని అతనికి దారి చూపించసాగాడు. రాజేష్ చక చకా నడవసాగాడు. అలా వాళ్లు రోజూ చాలా చోట్ల

యాచించడం వలన వారికి సరిపడినంత డబ్బు వచ్చేది. భోజనానికి ఇబ్బంది ఉండేదికాదు. కొన్ని రోజుల తరువాత "రాజేష్! ఇప్పుడు మన జీవితం బాగానే ఉంది. అయితే జీవితాంతం ఇలా యాచకులుగానే ఉండిపోదామా?" అని విశ్వం అన్నాడు.

"నా మనస్సులోని మాట చెప్పావు మిత్రమా!" అని సంతోషంగా అన్నాడు రాజేష్. "నాకో ఆలోచన వచ్చింది. రోజుకు మనకు సరిపడినంత మాత్రమే యాచిద్దాం. మిగతా సమయాన్ని చదువు నేర్చుకోవడానికి వినియోగిద్దాం. ఆ తరువాత కష్టపడి పనిచేసి బతుకుదాం" అన్నాడు. ఆ విధంగా ఒక మిషనరీ సాయంతో చదువు నేర్చుకుని బైబిల్ చదవడం నేర్చుకున్నారు. అంతేకాదు ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లే చేయడం కూడా నేర్చుకుని దేవుని పరిచర్య చేస్తూ ఉండేవారు. సువార్త కూడికలలో వారు బలమైన సాక్షులుగా నిలబడ్డారు.

"ఇప్పుడు నాకెంతో ఆనందంగా ఉంది మిత్రమా! ఇంత ఆనందాన్ని ఇంతకు ముందెన్నడూ అనుభవించలేదు. యాచన చేస్తున్నప్పుడు ఎంత డబ్బు వచ్చినా నాకు అశాంతిగానే ఉండేది" అన్నాడు రాజేష్. అతని మాటలతో ఏకీభవిస్తున్నట్టు గట్టిగా చేయి నిమిరాడు విశ్వం..

చూశారా! పిల్లలూ వాళ్లు ఎంతో బలహీనులు అయిననూ వారిని వారు శపించుకోకుండా ధైర్యంగా జీవించారు. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ సంతోషంగా జీవించారు. మీరు కూడా కష్టపడి బాగా చదువుకుంటే పెద్దవాళ్ళు అయ్యాక సంతోషంగా జీవిస్తారు. కష్టపడిన దానికి వచ్చే ప్రతిఫలం సంతృప్తిని కలిగిస్తుంది. ఈ రోజుల్లో కష్టపడటం అనేదే కన్పించటం లేదు సుఖపడటం ఒక ఫ్యాషన్ గా మారిపోయింది. నిజమైన సంతోషం, సంతృప్తి కష్టంలో నుండి వచ్చినవే.

మనకి అన్నీ సమకూర్చే తల్లిదండ్రులు ఉన్నారు. వారు మన భవిష్యత్తు కొరకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నారు. అయినా మనము ఉన్న పరిస్థితులను బట్టి సంతోషించట్లేదు. మనకి ఏ కష్టం లేకుండా నడిపిస్తున్న దేవుని యెడల కృతజ్ఞత ఉండట్లేదు. దేవుని ప్రేమ, తల్లిదండ్రుల మనస్సు గ్రహిస్తే కృతజ్ఞతతో జీవిస్తాము, కష్టపడడానికి ఇష్టపడతాము. అప్పుడు మనుష్యుల దయలోను, దేవుని దయలోను వర్ధిల్లుతాము.

ఈ న్యూ ఇయర్ లో మీరంతా కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు విధేయులై, దేవునికి కృతజ్ఞులుగా జీవిస్తారని ఆశిస్తూ.....

– ప్రేమతో మీ అక్కయ్య

# “నా జీవితములో దేవుని మేలులు”

విజయలక్ష్మి, రాజమండ్రి

నా పేరు విజయలక్ష్మి, మాది తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి, విగ్రహారాధన కుటుంబం. నా భర్త బట్టల వ్యాపారం చేస్తూ ఉండేవారు. మాకు ఇద్దరు పిల్లలు. నా భర్త చాలా ఎక్కువగా పూజలు చేస్తూ మాలలు వేసుకొని ఊళ్ళు తిరుగుతూ చాలా డబ్బులు ఖర్చు పెడుతూ ఉండేవారు. అయినా హృదయములో నెమ్మది, కుటుంబములో శాంతి ఉండేది కాదు. కొద్దిరోజులకు వ్యాపారంలో చాలా నష్టపోయి ఎలా బ్రతకాలో, ఎక్కడికి వెళ్ళాలో తెలియని అయోమయ పరిస్థితులలో, అందరూ చేయి విడిచి పెట్టేసారు. అప్పుడు మా బంధువులలో ఒకే ఒక్క కుటుంబము దేవుని నమ్ముకుని ఉన్నారు. వారు వచ్చి మమ్మల్ని ఎంతో ధైర్యపరిచి, వారితో పాటు ప్రార్థనకు తీసుకొని వెళ్ళి ఒక బైబిల్‌ను నాకు ఇచ్చారు. చాలా రోజులు నేను దానిని తెరిచి చదవలేదు కానీ ఒకరోజు చాలా దుఃఖపడుతున్నప్పుడు ఆ పుస్తకములో ఏమున్నదో చూడాలనిపించి ఒక పేజీ తీసి చదువుతున్నప్పుడు ఒక మనిషే నా ప్రక్కన ఉండి ఆదరిస్తున్నట్లుగా చాలా ఆదరణను పొందాను. నీవే నిజమైన దేవుడివి అయితే నాకు ఒక మార్గమును చూపించు అని అనుకున్నాను. అప్పుడు ఆశ్చర్యకరముగా రాజమండ్రి నుండి సామర్లకోటకు వచ్చి దేవునిని ఎరిగిన ఒక మామ్మగారి ఇంట్లో అద్దెకు దిగడం జరిగింది. అది మన పరిచర్యలోని ఒక సహోదరి వాళ్ళ తల్లిగారి ఇల్లు. కొద్దిరోజులకు వాళ్ళు వాళ్ళ అమ్మగారి ఇంటికి వచ్చినప్పుడు ఇక్కడి పరిచర్య దేవసేవకుల గురించి చెప్పి మమ్మల్ని ధైర్యపరిచి హైదరాబాద్‌కు వచ్చేయండి అని చెప్పారు. అప్పటికి మా పరిస్థితి చనిపోతే బాగుండు అని ఆలోచించుకుంటూ ఉండేవారము. వాళ్ళు చెప్పిన మాటలతో దేవుడు మనకు సహాయం చేస్తాడని, ఈ విగ్రహములను విడిచి, ఆ యేసయ్యానే నమ్ముకోవాలని తీర్మానించుకొని హైదరాబాద్‌కు వచ్చాము. వాళ్ళు చెప్పినట్లుగానే ఇక్కడి పరిచర్య, దైవసేవకులు చెప్పే దేవుని మాటలు మాకు ఎంతో సంతోషమును కలిగించేవి మరల మాకు ఒక క్రొత్త జీవితమును ఇచ్చాయి. ఆ విధంగా మేము 2003 నవంబర్ లో హైదరాబాద్‌కు రావడం, 2004 ఫిబ్రవరి నెలలో నూతన జన్మ అనుభవములోకి రావడం జరిగింది. 2004 జనవరి 1న మిమ్మును అనాథలనుగా విడువను అనే వ్యక్తిగతమైన వాగ్దానము ద్వారా దేవుడు మమ్ములను ఎంతో బలపరిచారు. నా భర్త, నేను చిన్న చిన్న ఉద్యోగములు చేసుకుంటూ పిల్లలను పెంచుతూ ఎలాగైనా పిల్లలను చదివించి, వాళ్లకి మంచి భవిష్యత్ ఉండే విధంగా చేయమని ప్రార్థించేదానను. కానీ పిల్లల చదువుకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలించక పోయినప్పటికినీ దేవుని సహాయం చొప్పున మా పెద్ద అబ్బాయికి 10వ తరగతి లో మంచి

మార్కులు వచ్చి ఇంటర్ కాలేజ్‌లో ఫ్రీ సీట్ రావడానికి దేవుడు సహాయం చేశారు. ఇంటర్ అయిపోయాక ఇంజనీరింగ్ ఎలా చదివించాలా అనే చింతతో ఉండేదాన్ని. ఇంజనీరింగ్‌లో కూడా ఫీజు రీ-ఎంబర్స్‌మెంట్ ద్వారా ఎలాంటి ఫీజు లేకుండానే 4సం॥లు చదువు పూర్తి అవడానికి దేవుడు సహాయం చేశారు. అలాగే మంచి జాబ్‌ని కూడా దేవుడు అనుగ్రహించారు. అంత మాత్రమే కాకుండా రక్షణను అనుగ్రహించి పరిచర్యలో ఒక పాత్రగా దేవుడు వాడుకొంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా చిన్న అబ్బాయి చదువులో కూడా దేవుడు తోడై ఉండి నడిపిస్తున్నారు. ఇప్పటికినీ కుటుంబములో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఉన్నప్పటికి, అన్ని పరిస్థితులలో దేవునిలో ఆనందిస్తూ ముందుకు వెళ్ళడం ఎలాగో దైవసేవకుల మాట ద్వారా దేవుడు బయలుపరుస్తూ నడిపిస్తున్నారు. సమస్యల వైపు కాక, శక్తిమంతుడైన యేసయ్య వైపు చూస్తూ ఎలా ముందుకు వెళ్ళాలో ప్రతిదినమూ నేర్పిస్తున్నారు. ఇక ఆశలు లేవు మరణమే శరణము అనుకున్న నా జీవితమునకు ఆశని కలిగించిన దేవుని కొరకే జీవితకాలమంతా జీవించాలనే వాంఛ తప్ప వేరొకటి లేదు.

నన్ను, నా భర్తను, పిల్లలను రక్షించి, బలపరిచి మాకు ఒక మార్గమును చూపించి కుటుంబమును ముందుకి నడిపిస్తున్నారు. అందును బట్టి దేవునికి వందనములు. పరిచర్యకు, దైవసేవకులకు కృతజ్ఞతలు చెల్లించుకుంటున్నాను.



# దాతృత్వం

"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురించుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది" – కీర్తన 19:1,2

ఈ కీర్తన ద్వారా దేవుని సృష్టి అంటే భూమ్యాకాశములు

→ దేవుని మహిమను వివరిస్తున్నాయని

→ ఆయన చేతి పనిని ప్రచురిస్తున్నాయని

→ బోధ చేస్తున్నాయని జ్ఞానమును తెలుపుచున్నాయని మనం నేర్చుకుంటాము.

దేవుని సృష్టిని జాగ్రత్తగా పరిశీలిస్తే కొన్ని పాఠాలు మనం నేర్చుకోగలము. అస్తవ్యస్తంగా ఉన్న ఈ విశ్వమును క్రమబద్ధం చేయడానికి భౌతిక నియమములున్నట్లే మానవ జీవితమును అదుపులో ఉంచడానికి దేవుడు కొన్ని ఆత్మీయ మర్మములను, నియమములను ప్రతిపాదించారు. వాటిలో దాతృత్వ ధర్మము ఒకటి ఇది మనకు "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును" – 2 కొరింథీ 9:6 అని నేర్పిస్తున్నది.

దేవుని జత పనివారముగా మన బాధ్యతలు ఏమిటో గ్రహించడం ముఖ్యం. "భూమియు దాని సంపూర్ణతయు, లోకమును దాని నివాసులును యెహోవావే" – కీర్తన 24:1. మనము యజమానులము కాదు గృహనిర్వాహకులం, సమస్త యాజమాన్యం దేవునిదే. ఈ జీవితములో వ్యక్తిగతంగా మనకి ఉన్న ఆస్తులు, జీవనోపాధులు, కుటుంబములు, సమస్తమైన ప్రాపంచిక, ప్రాపంచికం కానివన్నీ చివరకు దేవునివే. వీటన్నిటిని దేవుడు మనం అనుభవించడానికే దయచేశాడు. అవన్నీ దేవునికి చెందినవేనని మనం గ్రహించినప్పుడు వాటి బాధ్యత దేవునిదే అనే నిశ్చింతతో మనం ఉండగలము. ఇంకొకరికి చెందిన ఆస్తిని నిర్వహిస్తూ, దానిని జాగ్రత్తపరిచేవాడు గృహనిర్వాహకుడు. ఈ గృహనిర్వాహకత్వములో నమ్మకంగా ఉండవలసిన కర్తవ్యం మనకి ఉన్నది. ఆయన మనకి ఇచ్చిన వాటి యొక్క భద్రత, నిర్వహణల ప్రత్యేక బాధ్యతను గూర్చి ప్రభువు మనలను పూచీదారులుగా పరిగణిస్తాడు (మత్తయి 25:14-30) మనం అనుభవించే దేవుని ఆస్తిపై మనకి ఉన్న యాజమాన్యం – గృహనిర్వాహక సంబంధమును అవగాహన చేసుకున్నప్పుడు ఇవ్వడం అన్నది సులభమవుతుంది. మనకి ఉన్న ప్రతి ఒక్క వస్తువు దేవుని ఎదుట గృహనిర్వాహకత్వానికే చెందుతుంది.

**మన జీవితం** : దేవుని ఆత్మ నన్ను సృజించెను
సర్వశక్తుని యొక్క శ్వాసము నాకు జీవమిచ్చెను – యోబు 33:4

**మన సమయం :** దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానుల వలె కాక,జ్ఞానుల వలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి – ఎఫెసీ 5:15,16

**మన నిపుణతలు, సామర్థ్యాలు :** దేవుని నానా విధమైన కృప విషయమై మంచి గృహనిర్వాహకులై యుండి, యొక్కొక్కడు కృపావరము పొందిన కొలది యొకనికొకడు ఉపచారము చేయుడి. – 1 పేతురు 4:10

**మన ఆస్తిపాస్తులు :** మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు; పైనున్న వాటి మీదనే గాని, భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టుకొనకుడి – కొలస్సీ 3:1,2

**మన ఆదాయము :** ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు, అతడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా ఉండి, యొకని తృణీకరించును. మీరు దేవునికిని, సిరికిని దాసులుగా ఉండనేరరు – మత్తయి 6:24

**సువార్త సందేశము:** ఓ తిమోతీ, నీకు అప్పగింపబడిన దానిని కాపాడి, అపవిత్రమైన వట్టి మాటలకును, జ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములకును దూరముగా ఉండుము – 1 తిమోతి 6:20

అయినప్పటికిని అనేకమంది క్రైస్తవులు ఇవ్వాలని ఎంతో అనుకున్నా ఇవ్వడం సమస్య అవుతూ ఉంటుంది. మంచి గృహ నిర్వాహకత్వపు సంపూర్ణ దీవెనలను పొందడానికి ఒక విశ్వాసి విడుదల చేసే కార్యము సమర్పణ. మనలను మనం అర్పించుకున్నప్పుడే దేవుడు మనకిచ్చిన సంపదను దేవునికి ఇవ్వడం నేర్చుకుంటాము.

**ఆది సంఘములో ఇవ్వడం ఏ విధంగా ఉందంటే :**

"విశ్వసించిన వారందరూ ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చర స్థిరాస్తులను అమ్మి అందరికిని వారి వారి అక్కర కొలది పంచి పెట్టారు" – (అపో.కా॥ 2:44,45) ఆది క్రైస్తవులలో కనిపించిన ఈ మూల వైఖరే ఆ తరువాత వచ్చిన ప్రతివారిలోనూ ఇవ్వడమనే భావనకు పునాది వేసింది. ఆది సంఘం కానుకలను విధవరాండ్రకు అవసరతలో ఉన్నవారికి పంచి పెట్టడానికి ప్రత్యేకమైన వ్యక్తుల్ని "పరిచారకులుగా" ఎన్నుకున్నది. నిజమైన అవసరత

ఉన్న చోటికి రాబడిని మరలించడమే తమ పరిచర్యగా వీరు చేసుకున్నారు.

యెరూషలేములోని యూదా క్రైస్తవులు కరువులో ఉన్నప్పుడు వారికి పేదరికములో శ్రమలలో ఉన్న యూదేతరులైన క్రైస్తవులు సహాయపడ్డారు. అపోస్తలుడైన పౌలు ఒక స్థలం నుండి మరో స్థలమునకు నూతన సంఘములను స్థాపిస్తూ ప్రయాణించాడు. కొన్ని సందర్భములలో తన స్వహస్తాలతో తన సొంత అక్కరల కొరకు పని చేశాడు. పౌలు వంటి సంచారక పరిచారకులను ఆదరించడం, పోషించడం ద్వారా ఫిలిప్పీ సంఘం నిజమైన దాతృత్వపు స్ఫూర్తిని ప్రదర్శించింది. క్రైస్తవులు ఇవ్వడానికి కష్టించి పనిచేశారు. **"దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కర గలవానికి పంచిపెట్టుటకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచి పని చేయుచు కష్టపడవలెను" - ఎఫెసీ 4:28** దాతృత్వమే వారి ప్రేమకు ఋజువు ప్రస్తుతమందు మీ సమృద్ధి వారి అక్కరకును...కాబట్టి మీ ప్రేమ (దాతృత్వం) యథార్థమైనదనియు... సంఘముల ఎదుట కనుపరచుడి.

**దాతృత్వపు నియమములు :-**

దేవుని పనికొరకు మనం ఇవ్వడం ప్రారంభించాలని దేవుడు ఎదురు చూస్తున్నారు. **"నా మందిరములో ఆహారముండునట్లు పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొనిరండి. దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి, పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు" - మలాకీ 3:10**

మనం ఒక పద్ధతిలో క్రమంగా ఇవ్వాలి **"హిజ్కియా యెహోవా మందిరములో కొట్లను సిద్ధపరచవలసినదని ఆజ్ఞ ఇచ్చెను. వారు వాటిని సిద్ధపరిచి ఏమియు అపహరింపకుండ కానుకలను పదియవ భాగములను ప్రతిష్ఠితములుగా తేబడిన వస్తువులను లోపల చేర్చిరి" - 2 దినవృ 31:11,12**

ప్రభువునకు మనం మొట్టమొదటిదీ శ్రేష్టమైనదీ ఇవ్వాలి **"నీ రాబడి అంతటిలో ప్రధమఫలమును నీ ఆస్థిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము, అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగా నుండును నీ గానుగలలో నుండి క్రొత్త ద్రాక్షారసము పైకి పొరలి పారును" - సామె 3:9,10.**

దీనిద్వారా దేవుని పనికొరకు మనము ఇవ్వడం నేర్చుకొనవలసియున్నది. భయముతోనో, లాభాపేక్షతోనో కాక సంతోషముతో దేవుని పనికొరకు ధనమును ఇచ్చువారిని ఆయన వర్ధిల్లచేయును.

ఇట్టి ధన్యత మనకు కలుగును గాక!

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

విజ్ఞాపన బలమైనది, అనేకమందిని మార్చగలదు. కాని విజ్ఞాపన దేవుని మనస్సును కూడా మార్చుతుంది. ప్రార్థన యొక్క ఫలితంగా దేవుడు ప్రణాళిక చేసుకున్నదానిని కూడా తిరిగి ఆలోచిస్తాడు. **కాగా యెహోవా మోషేతో ఇట్లనెను. నీవు దిగి వెళ్ళుము ఐగుప్తు దేశము నుండి నీవు రప్పించిన నీ ప్రజలు చెడిపోయిరి నేను వారికి నియమించిన త్రోవ నుండి త్వరగా తొలగిపోయి తమ కొరకు పోతపోసిన దూడను చేసికొని దానికి సాగిలపడి బలిని అర్పించి - ఓయీ ఇశ్రాయేలు, ఐగుప్తు దేశము నుండి నిన్ను రప్పించిన నీ దేవుడు ఇదే అని చెప్పుకొనిరనెను - నిర్గమ 32:7-8**



మోషే పది ఆజ్ఞలు తీసికోవడానికి, సీనాయి కొండపైకి వెళ్ళి చాలా కాలం తిరిగి రాలేదు. వారి నాయకుడు లేని సమయములో వారు ప్రభువును మరచిపోయి, శరీర కోరికలకు తమను తాము అప్పగించుకున్నారు. తమ నగలను కరిగించి, పోతపోసిన దూడను చేసికొని దానిని ఆరాధించుటకు మొదలుపెట్టారు. దేవుడు మోషేతో నీవు తిరిగి వెళ్ళటం మంచిది. ఎందుకంటే ప్రజలు చాలా గందరగోళం చేస్తున్నారు. ఆ విషయములో నేను చాలా కోపంగా ఉన్నాను అని చెప్పాడు. **ఆయన కోపము నిమిషమాత్రముండును, ఆయన దయ ఆయుష్కాలముండును అని కీర్తనలు 30:5 చెప్తుంది**

తరువాత : **మరియు యెహోవా ఇట్లనెను - నేను ఈ ప్రజలను చూచి యున్నాను ఇదిగో వారు లోబడనొల్లని ప్రజలు. కావున నీవు ఊరకుండుము నా కోపము వారి మీద మండును, నేను వారిని కాల్చివేసి నిన్ను గొప్ప జనముగా చేసెదనని మోషేతో చెప్పగా - నిర్గమ32:9-10**

బ్రహ్మాండమైన తలంపులు గల దేవా వాళ్ళని గురించి మర్చిపో, నాతోనే ఏదైనా గొప్ప పని చేయి అని మోషే దేవునితో చెప్పలేదు గాని దానికి బదులుగా వారి కొరకు విజ్ఞాపన చేయడం మొదలుపెట్టాడు. ఎందుకనగా అతను వారి గురించి చాలా శ్రద్ధ తీసుకున్నాడు. "మోషే తన దేవుడైన యెహోవాను బ్రతిమాలుకొని" అని బైబిలు చెప్తుంది (నిర్గమ 32:11) అంటే అతను ఊరకుండలేదు. కానీ దేవుడు ముందుగానే నీవు ఊరకుండుము వారి గురించి ప్రార్థించవద్దు ఒకవేళ నీవు ప్రార్థించినట్లయితే నేను నీ ప్రార్థన వినవలసి వస్తుంది అని చెప్పాడు కాని మోషే యెహోవాను బ్రతిమాలుకొని – యెహోవా నీవు

మహాశక్తి వలన బాహుబలము వలన ఐగుప్తు దేశములో నుండి రప్పించిన నీ ప్రజల మీద నీ కోపము మండనేల? అని ప్రార్థించాడు (నిర్గమ 32:11) మోషే హృదయమునకు అది నచ్చలేదు గనుక అతడు దానిని వదిలిపెట్టలేదు. అతను ప్రజలను ప్రేమించాడు అతనికి దేవుని



స్వభావము తెలుసు అన్నిటికి మించి దేవుని వ్యక్తిత్వము, ఆయన నిజంగా ప్రేమిస్తున్నాడని, వారిని మధ్యలో నిస్సహాయ స్థితిలో విడిచిపెట్టుటకు ఇష్టపడడని తెలుసు.

దేవుడిని మనస్సు మార్చుకోమని మోషే చెప్పాడు ఆయన కొండలలో వారిని చంపునట్లును భూమి మీద నుండి వారిని నశింపజేయునట్లును కీడు కొరకే వారిని తీసికొని పోయెనని ఐగుప్తీయులు ఏల చెప్పుకొనవలెను? నీ కోపాగ్ని నుండి మళ్ళుకొని నీవు నీ ప్రజలకు ఈ కీడు చేయక దాని గూర్చి సంతాపపడుము. నీ సేవకులైన అబ్రాహామును ఇస్సాకును ఇశ్రాయేలును జ్ఞాపకము చేసుకొనుము. నీవు వారితో ఆకాశ నక్షత్రములవలె మీ సంతానమును అభివృద్ధి జేసి నేను చెప్పిన ఈ సమస్త భూమిని మీ సంతానమునకిచ్చెదననియు, వారు నిరంతరము దానికి హక్కుదారులగుదురనియు వారితో నీ తోడని ప్రమాణము చేసి చెప్పితివనెను (నిర్గమ 32:12-13) దేవుడు తన మనసు మార్చుకున్నాడని బైబిల్ చెప్తుంది. "అంతట యెహోవా తన ప్రజలకు చేసెదనని చెప్పిన కీడును గూర్చి సంతాపపడెను" (నిర్గమ 32:14) విజ్ఞాపన యొక్క శక్తి మరియు ఉద్దేశ్యములో ఇది ఒక భాగము మనము ప్రార్థించినప్పుడు భిన్నత్వమును కలుగజేయగలము!

(ఇంకా ఉంది)

సేకరించబడింది

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2016 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | మంగళ | 9.00 | భాగ్యలత |
| మార్చి | 25 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మే | 01 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| ఆగష్టు | 15 | సోమ | 9.00 | భాగ్యలత |
| అక్టోబర్ | 02 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |

**యౌవనస్థుల కూడికలు:-**
ప్రతి నెల 2వ బుధవారం - భాగ్యలత
రాత్రి గం. 7.00 లకు

**స్త్రీల కూడికలు:-**
ప్రతి నెల 1వ బుధవారం - భాగ్యలత
ప్రతి నెల 2వ బుధవారం - చింతల్
రాత్రి గం. 7.00 లకు

**పరిచారకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం - భాగ్యలత నందు రాత్రి గం. 7.00 లకు.

## ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీస్ - హాలిడేస్ - 2016

| | | | |
|---|---|---|---|
| జనవరి 1 | - న్యూ ఇయర్ | ఆగష్ట్ 15 | - స్వాతంత్ర్య దినోత్సవం |
| జనవరి 15 | - సంక్రాంతి | సెప్టెంబర్ 5 | - వినాయక చవితి |
| జనవరి 26 | - రిపబ్లిక్ డే | అక్టోబర్ 11 | - దసరా |
| మార్చి 25 | - గుడ్ ఫ్రై డే | అక్టోబర్ 30 | - దీపావళి |
| ఏప్రియల్ 8 | - ఉగాది | | |

## 2016 - వాగ్దానము

**"నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును - కీర్తన 91:11**




# బైబిల్ క్విజ్ -44

(సమూయేలు గ్రంథం నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** ఏ పట్టణస్థుల కేకలు ఆకాశము వరకు వినబడెను?

**2.** కాడి ఎడ్లను ముక్కలు చేసి వాటిని ఇశ్రాయేలు దేశమంతా పంపినదెవరు?

**3.** ఇబ్బందిగల ప్రజలకు, అప్పులు చేసిన ప్రజలకు, అసమాధానము గా నుండు ప్రజలకు నాయకుడు ఎవరు?

**4.** లంచములు పుచ్చుకొని న్యాయమును త్రిప్పివేసిన న్యాయాధిపతులు ఎవరు?

**5.** దావీదు నివసించటానికి ఆకీషురాజు అతనికిచ్చిన స్థలం ఏది?

**6.** యెహోవా మందసాన్ని కాపాడటానికి ప్రతిష్ఠించబడిన వ్యక్తి ఎవరు?

**7.** సోదె చెప్పుట అనే పాపంతో సమానమైన పాపం ఏది?

**8.** ఒక పిచ్చివానివలె దావీదు ఏ రాజు ముందు నటించెను?

**9.** యెహోవా మందసాన్ని తెరచి చూచినందుకు ఎవరు చనిపోయారు?

**10.** యాజకుల పట్టణంగా పేర్కొనబడిన పట్టణమేది?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జనవరి 31 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి 2016 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌టాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 43 జవాబులు (రూతు గ్రంథం నుండి ఇవ్వబడినవి) :**

**1.** శల్మాను (4:20)
**2.** బ్రతికిన వారికి, చచ్చిన వారికి ఉపకారము చేయుట మాననివాడు, విడిపింపగలవాడు (2:20)
**3.** రాహేలు, లేయా (4:11)
**4.** ఎలీమెలెకు కుటుంబం (1:1,2)
**5.** కొద్దివారినే గాని గొప్పవారినే గాని యౌవనస్థులను వెంబడింపక యుండుట వలన (3:10)
**6.** ఓబేదు (4:17)
**7.** నయోమి తన కోడళ్ళతో (1:13)
**8.** రూతు - బోయజుతో అనెను (2:10)
**9.** ఒకడు తన చెప్పు తీసి తన పొరుగువాని కిచ్చుటయే (4:7)
10. బోయజు - రూతుకి ఇచ్చెను (3:15)

**బైబిల్ క్విజ్ - 43 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

షీబా, డేవిడ్‌రాజు, పాపరమేష్, సుశీల

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జనవరి - ఫిబ్రవరి

**భాగ్యలత :** యోహాను, సుధాకర్, సంతోషి, సుజాత, చైత్రికాబిస్వాల్, రవికుమార్ బెన్ని, అభిషేక్, అనిల్‌కుమార్, హానోక్, కిరణ్‌కుమార్, గిఫ్టీషారోన్, నవీన్, రమాదేవి, సుధారాణి, కుమారి, క్రాంతికృష్ణ, అంజి, శ్రీదేవి, శిరీష, పాల్‌ప్రవీణ్, దీవెన, శ్రీధర్, నిర్మల, మంజుల, జోసెఫ్, రాబిన్, బ్యూలా, పూజిత, సౌజన్య, సుస్మిత, సుమతి, తిమోతి, నిహారిక, రమేష్, అశోక్, జ్యోత్స్న, కరుణాకర్‌రాజ్, శ్రీనివాస్, సునీత, ఎస్తేరు, ఉదయ్‌కుమార్, అనిత, రాణి, రాజా, తరుణోదయ్, తేజస్విని, రవి, విజయలక్ష్మి, జ్యోతి, సజీవ్, శ్రీలక్ష్మి, శంకర్, అఖిల్, శ్రావ్య, సత్య, కృపాలత, రగూయేల్, సురేఖ, రాజేష్, సుధీర్, క్వీన్స్‌మెల్కీసెదెక్, చల్లారావు, హర్షిత, మీనా, పాండు, హిమబిందు, వెంకటలక్ష్మి, శైలజ, తులసి, మనోహర్, వెంకన్న, జైన్, నానికుమార్, ఫ్రాన్సిస్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఫీబే, ఉమాశ్రీ, వేణుమాధవ్, ఆనందరావు, వినోద్, జీవన్, దివ్యాంస్, అనూష, ప్రశాంత్, తబిత, తిరుమల, హైమావతి, నవ్యశ్రీ, జ్యోతిర్మయి, అనిలకుమారి, బాపూజీ, రాజ్‌కుమార్, కీర్తన, మణి, తనూషారాణి.

**చింతల్ :** కొర్నేలీ, ప్రకాశ్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, పుష్పలత, జెర్రీరోజ్‌రాయ్, ఉదయ్, రిబ్కా, దానియేల్, జె.యస్.ఎన్.మూర్తి, పవన్‌చందు, హెప్సిబా, అమర్, సువర్ణరాజు, మహిమజ్యోతి, హైమావతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి, సురేఖ, సుధీర్, అఖిల్, రాజేష్

**అనాజ్‌పూర్ :** సువమ్మ, అంకమ్మ, సునీత, మరియ, లక్ష్మి, అమర్‌నాథ్, జాన్‌బీ, కీర్తి

**ఇ.సి.ఐ.యల్ :** జీవా, సజీవ్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# డిసెంబర్ 31 మరియు జనవరి 1వ తేదీ ఆరాధనలలో పాల్గొనిన దేవుని ప్రజలు



డిసెంబర్ 31

జనవరి 1



## 2015, డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ ఆరాధన యొక్క ఛాయాచిత్రములు






# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras